# రాత్రి పూలు

"అన్నయ్యా! నీ భావాలవల్ల నువ్వు నీ జీవితాన్ని చాలా నష్టపోయావు. నీ బతుకుపొద్దు పడమటికి వంగింది. నీతోటి వాళ్ళు ఎపుడో ఆగిపోయారు. వాళ్ళు చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఫలాలు అనుభవిస్తున్నారు. నువ్వు చేసినకాడికి చాలు. నువ్వు చెయాల్సింది ఇక యువతరం చేయాలి. చేస్తుంది. నేనింకా ఎన్నాళ్ళో బతకనని నీకు తెల్సు. నా చివరి కోరిక మన్నిస్తావు గదూ!"

ప్రమీల ఏడుస్తోంది...

రమేశ్ మనస్సు భారమైంది... గొంతు పెకలలేదు.

ఆసుపత్రి గదిలో నిశ్శబ్దం... బెడ్‌పై ప్రమీల. మంచం ప్రక్కనే స్టూలు మీద రమేశ్.

చెల్లెలు ప్రమీల కళ్ళను తుడిచాడు రమేశ్.

"ప్రమీలా! అలా అనకు. నువ్వు తప్పక బతుకుతావు. నిరాశ పనికి రాదు.

ఆత్మ విశ్వాసం రోగాల్ని కూడా జయిస్తుంది".

"అన్నయ్యా! మాట మార్చకు. డాక్టరు ఏం చెప్పాడో అంతా నాకు తెల్సు. నా గురించి కాదు. నీగురించి బాధపడుతున్నాను. మా కోసం... ఇతరుల కోసం నువ్వు చేసిన త్యాగాలు చాలు..."

"ప్రమీ! కొన్ని నక్షత్రాలు చూడు. వెన్నెల లేనపుడు దారి చూపుతాయి. వెన్నెల ఉంటే అవి కనపడవు. అలాగే కొన్ని పూలు రాత్రి పూసి పొద్దు పొడవడంతో రాలిపోతాయి. కొన్ని ఉదయం పూసి మధ్యాహ్నానికే వాడిపోతాయి. ముగ్గురి జీవితాల్లో ఆశల చిరుదీపంవెలిగించిన నీ జీవితం కొడిగట్టడం నన్నెంత బాధిస్తున్నదో... నా గురించి నేను ఆలోచించుకునే టైం లేదు. ఆ టైం రాకుండానే గడిచిపోవాలని నా కోరిక".

"అన్నయ్యా! రెండు నెలలుగా మంచంలోపడి చావు అంటే ఏమిటో తెల్సుకున్నాను. నాకిపుడు నా గురించి బాధలేదు. నా మనస్సు చాలా ప్రశాంతంగా ఉంది. నీ కన్నా చాలా చిన్నదాన్ని. కాని ఒక్కటి అడుగుతాను. ఈ క్షణంలో నీవు చనిపోతావని తెల్సింది. ఏం చేస్తావు? ఇపుడు అదే చేయి. నీ త్యాగం, నీ భావాలు నిన్ను నీవు శిక్షించుకోవడంగా పరిణమించకూడదు కదా!"

"ప్రమీ! జీవితం అంటే ఏమిటి! బతుకంతా గడిచాక ఈ ప్రశ్న వేసుకొని ఏం లాభం? బతికినంత కాలం ఈ ప్రశ్నే ఎదురుకాదు. ఇదో విచిత్రం"

"ప్రమీ! నేను చాలా కోల్పోయానని, జీవితాన్ని నష్టపోయానని ఎందుకు బాధపడ్తావు. అది నీ దృష్టి... నేను కోల్పోయిందానికన్నా పొందిందే ఎక్కువ. మీ ప్రేమ నేను చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ." నేను జీవితాన్ని ఓడిపోలేదని, ఉన్నతమైన జీవితాన్నే గెలుచుకున్నాననే తృప్తినైనా నాకు మిగల నివ్వు".

"అన్నయ్యా! అంత మాటంటే నిన్ను ఏమీ అడగను". అన్నయ్య కళ్ళల్లోకి సుదీర్ఘంగా చూసి కన్నీళ్ళు పెట్టుకొంది ప్రమీల. కనురెప్పలు మూత పడ్డాయి. చెంపమీదుగా సన్నని ధార మగతగా ఒరిగింది. ఏవేవో జ్ఞాపకాలు...

తనకు నచ్చని త్యాగాలను చూసి మనిషి అసూయ పడ్తాడా? ఆ అసూయ జాలి, సానుభూతి రూపంలో వ్యక్తమవుతుందా!

మొదటిసారిగా ప్రమీలకు సందేహం కలిగింది. రమేశ్ అన్నయ్య కుటుంబం కోసం చాలా చేశాడు. సమాజం కోసంకూడా చాలా చేశాడు. రక రకాల ఉద్యమాల్లో తిరిగాడు. ఎన్నో ఉద్యమాలు తానే ముందుండి నడిపాడు.

ఉద్యమం ఒక నిర్మాణ రూపం తీసుకోగానే క్రమంగా నాయకత్వ పోటీ నుండి తప్పుకునేవాడు.

పోటీ పడ్డం అతని స్వభావం కాదు. పోటీ నుండి తప్పుకోవడం అతని సహజ లక్షణమైపోయింది. పోటీ నుండి తప్పుకొని తనదైన దారిలో కొత్త దారి వేసేవాడు.

'రాజ్యం'ను ఈ పోటీలో గెలుచుకోవడం యిష్టం లేదు. పోటీపడి గెలుచుకోవడం నామోషి అన్పించింది. తన ప్రేమను, యిష్టాన్ని ఉదాసీనతగా మార్చుకున్నాడు. రాజ్యం తన ప్రేమను వ్యక్తం చేయలేకపోయింది. పైగా 'అన్నయ్య' ప్రేమించడం మానేశాడని గొణిగింది. తప్పు పట్టింది. పోటీపడి ప్రేమిస్తున్న లక్ష్మణ్‌ను ప్రేమించానంది. పెళ్ళి చేసుకుంది.

అప్పట్నుంచి పోటీపట్ల, పోటీపరీక్షల పట్ల ఆసక్తి పోయింది. అనుకోకుండా వచ్చిన ఉద్యోగాన్ని సరిపెట్టుకుని అందర్నీ యింతవారిని చేశాడు.

---

అన్నయ్య మాటలు గుండెలోతులో మళ్ళీ మళ్ళీ ప్రతిధ్వనిస్తున్నాయి. ఎంతసేపు నిద్ర పోయిందో.

రాత్రయ్యింది. మగతగా మెల్లగా కళ్ళు తెరిచింది.

అన్నయ్య అలాగే చూస్తున్నాడు. చెల్లి కళ్ళుతెరవడంచూసి నవ్వాడు. చెల్లెలు మళ్ళీ ధైర్యం తెచ్చుకుంది.

"అన్నయ్య... చెల్లెలు పెళ్ళయ్యేదాక పెళ్ళి చేసుకోనన్నావు. నా పెళ్ళయిపోయింది. మళ్ళీ చిన్నచెల్లెలు పెళ్ళి అన్నావు. దాని పెళ్ళీ అయిపోయింది. దానికీ యిద్దరు పిల్లలయ్యారు. నిన్ను అడగడానికి అందరికీ భయమే. అసలు నువ్వెందుకు పెళ్ళి చేసికోవడం లేదు అన్నయ్యా!"

"ప్రమీ! పెళ్ళే జీవితానికి పరమార్థం అనుకోను".

" ఈ చెల్లెల్ల పెళ్ళిళ్ళు, పురుళ్ళు, కట్నాలు, ఖర్చుల కోసం అని నీవు పెళ్ళి చేసికోవడం మానేశావు".

"అదేం కాదు."

"నువ్వు ప్రేమించిన రాజ్యం నిన్ను ప్రేమించలేదని వైరాగ్యమా!"

"మొదట అదే ఉండేది. ఇపుడు రాజ్యం మీద కోపం ఏమీ లేదు".

"నువ్వు అసలే పెళ్ళి చేసికోక పోవడం చూసి రాజ్యం బాధపడ్తోంది".

"ఆమెను బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. అలా అని ఆమె సంతోషం కోసం నేను పెళ్ళి చేసికోలేను."

"ఏం సాధిద్దామని, ఎవర్ని సాధిద్దామని"!

"పెళ్ళి చేసికొని మీరంతా ఏం సాధిద్దామనుకున్నారు? ఏం సాధించారని? ప్రకృతిలో పశు పక్ష్యాదులూ, ప్రతి ప్రాణీ పిల్లల్ని కంటున్నాయి. అదేనా మీరు సాధించింది?"

" అన్నయా!... అదే లేక పోతే ఈ ప్రపంచమే లేదు. నువ్వు లేవు నేను లేను."

"అదే ప్రపంచమా!"

"కాదు."

"అయినపుడు నా యిష్టప్రకారం నన్ను బతకనీ"

ప్రమీల మూగబోయింది.

"ప్రమీ! నా భావాలే నన్ను బతికిస్తున్నాయి. నీవు సమాజం కోసం చేస్తున్నాని అంటున్నదంతా నిజానికి నాకోసమే. అదే నా ఆనందం. నా భావాలు వదులుకోమనడం నన్ను చనిపోవాలని కోరడం తప్ప వేరు కాదు."

అన్నయ్యతో అంతగా వాదించడం యిదే మొదటిసారి. బహుశ చివరిసారి కూడా! అనుకుంది ప్రమీల. చూపుతిప్పుకుంది.

కిటికీలోంచి ఆకాశంలో చుక్కలు రాత్రిపూలలా మిలమిల మెరుస్తున్నాయి.

"అన్నయా! నేను జీవితంలో అమ్మతనం సాధించాను. ఈ జీవితానికి యిది చాలు".

తృప్తిగా కళ్ళు మూసుకుంది ప్రమీల. రమేష్ ఆత్మీయంగా తలపై చెయ్యితో నిమిరాడు.

ఆదివారం వార్త